# తెలుగుప్రభ


మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha @TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

సోమవారం 24-7-2023

జీ - 20 వేదిక

## ప్రారంభించనున్న ప్రధాని

**న్యూఢిల్లీ, జూలై24(తెలుగుప్రభ):**

నగరంలో జీ–20 నాయకుల సమావేశానికి ఆతిథ్యమిచ్చేందుకు ప్రగతిమైదాన్‌లో నిర్మించిన వేదికను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. దాదాపు 123 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఇది భారత్‌లోని అతిపెద్ద మైస్(మీటింగ్స, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్) కేంద్రంగా రికార్డు కెక్కనుంది. దీనిలోని కన్వెన్షన్‌సెంటర్‌లోని 3వ లెవల్‌లో ఏడువేలమంది కూర్చునేందుకు నిర్మించిన మీటింగ్ హాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జర్మనీలోని హన్నోవర్ ఎగ్జిబిషన్ సెంటర్, షాంఘైలోని నేషనల్ ఎగ్జిబిషన్,కన్వెనర్షన్ సెంటర్ల సరసన ఇది చేరనుంది.



బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్ నుంచి పడి

## యువకుడి మృతి

**హైదరాబాద్, జూలై24(తెలుగుప్రభ):**

గచ్చిబౌలి బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్ పైనుంచి పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆదివారం రాత్రి ఇద్దరు యువకులు బైక్‌పై ప్రయాణిస్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో అదుపు తప్పి రెండో వరుసలో ఉన్న ఫ్లై ఓవర్ నుంచి కింద ఉన్న ఫ్లై ఓవర్‌పై పడిపోయారు. తీవ్రగాయాలతో ఒకరు అక్కడిక్కడే మృతిచెందారు. మృతి చెందిన యువకున్ని గచ్చిబౌలిలో నివాసముంటున్న మధు(25)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మరో యువకున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.




# ఆయన స్టైలే వేరు

పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికే..

కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా..

ఈనెల 24కు కొన్ని రోజుల ముందు నుంచే రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో పండుగ వాతావరణం మొదలైంది. ఎవరికి వారుగా పండుగ ఏర్పాట్లలో మునిగారు. అందుకు కారణం చాలామందికి అది స్పెషల్ పండుగ. తాము ఎవరి పుట్టినరోజునైతే పండుగగా భావిస్తున్నారో ఆయన ఆలోచన కనుగుణంగా వేడుకల పేరిట దుబారా చేయకుండా 'గిఫ్ట్ ఏ స్మైల్ కింద పేద, అనాథ విద్యార్థుల చదువులకు ఆర్థికంగా చేయూత నందించేందుకు ముందుకొచ్చారు. డిజిటల్ ట్యాబ్‌లు, ఇతరత్రా పరికరాలు పంపిణీ చేస్తున్నారు.

**హైదరాబాద్, జూలై14(తెలుగుప్రభ):**

తన47వ పుట్టిన రోజు సందర్భంగా 10, 12 తరగతులు చదువుతున్న ప్రతిభావంతులైన 47 మంది విద్యార్థులకు, వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న మరో 47 మందికి ల్యాప్‌టాప్ లివ్వడంతో పాటు వారి భవిష్యత్‌కు మంచి బాట వేసేందుకు మంచి ఇనిస్టిట్యూట్‌లో శిక్షణకు అవసరమైన సహాయాన్ని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కేటీఆర్ అభిమానులుగా ఆయన బాటలో నడుస్తూ చాలామంది తమవంతు సహాయ సహకారాలందిస్తున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కిందే గడిచిన సంవత్సరాల్లో ఆస్పత్రులకు అంబులెన్సులు, దివ్యాంగులకు స్కూటర్లు వంటివి పంపిణీ చేయడం తెలిసిందే.

### గిఫ్ట్ ఏ స్మైల్' పేరిట

పుట్టినరోజును భిన్నంగానే కాకుండా అర్థవంతంగా దానికో సార్థకత ఉండేలా 'గిఫ్ట్ ఏ స్మైల్ ' పేరిట అవసరమైనవారి ముఖాల్లో చిరునవ్వులు పూయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతే కాదు..రాజకీయాలంటే చాలామందిలో ఉన్న చిన్నచూపు పోయేలా చేయగలిగారు.రాజకీయాల ద్వారా ఏం చేయవచ్చో తన చేతల ద్వారా చూపుతున్నారు. అంతేకాదు.. రాజకీయాల్లో రాణించాలి అని పలువురు అనుకునేలా తన నడవడికతో చేసి చూపిస్తున్నారు. పల్లెల్లోకి, ప్రజల మధ్యకు వెళ్తే ఆయనో పక్కా మాస్ లీడర్. అంతర్జాతీయ వేదికల మీద మంచి స్పీకర్. ఏదైనా ప్రాజెక్టు చేయాలంటే టీమ్ లీడర్. ఈ తరం రాజకీయ నేతలకు రోల్ మోడల్. ఇలా ఇంకా ఎన్నయినా చెప్పుకుంటూ పోవచ్చు. ప్రపంచంలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అందుకనుగుణంగా ముందుకు వెళ్తూ, రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా చేయడంలో .. సామాజిక మాధ్యమాల ద్వారా సైతం ఆపదలోని వారిని ఆదుకోవడంలో.. ముఖ్యంగా డబ్బులు లేకపోవడం వల్ల విద్య,వైద్యానికి ప్రజలు దూరం కారాదనే తలంపుతో ఆయనిస్తున్న చేయూత సామాన్యమైనది కాదు. ఏ రంగంలో అయినా సరే విషయపరిజ్ఞానంలోనే కాక ఎక్కడ ఏ భాష అవసరమైతే అక్కడ అది మాట్లాడగల సామర్థ్యం ఆయన సొంతం. పలు గ్లోబల్ సమ్మిట్‌లకు ఆయనకు ఆహ్వానం అందుతోందంటే అందుకు కారణం ఆయన మంత్రి కావడమే కాదు.. ఆయా అంశాల్లో ఆయనకున్న అవగాహన.అంతర్జాతీయ వేదికలపై ఆంగ్లంలో ఎంత అందంగా మాట్లాడగలరో.. అవసరమైతే ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు పక్కా తెలంగాణ యాసలోనూ విరుచుకుపడగలిగే నైజం ఆయనది.

### పదవిని బాధ్యతగా..!

ఇక మంత్రిగా ఆయన నిర్వహిస్తున్న శాఖల మీద ఆయనకున్న పట్టు గురించి చెప్పాల్సిన పనిలేదు. టీహబ్ వీహబ్, టీ వరక్స్ , తదితరమైన వాటి గురించి తెలిసిందే. నగరంలో ఫ్లై ఓవర్ల పనులు పూర్తయినా, నాలాల పనులు జరుగుతున్నా వాటిపై ఆయనకున్న శ్రద్ధే కారణమని చెప్పక తప్పదు. పలువురు పలు రకాలుగా కేటీఆర్ మీద అభిమానాన్ని చూపుతున్నారు. నోట్‌బుక్స్‌తో మొజాయిక్ ఆర్ట్‌తో కేటీఆర్ రూపాన్ని ప్రతిబింబించిన వారొకకైతే, ప్యారాచూట్లతో వెళ్లి ఆయన ఫ్లెక్సీని గగనంలో ప్రదర్శించిన వారు ఇంకొకరు. ప్రత్యేకంగా రాసి పాటలు పాడిన వారు ఎందరో. ఎందరెందరో ఆయన పుట్టినరోజును జరుపుతున్నారంటే అదే ఆయన ప్రత్యేకత. పుట్టినరోజులు అందరూ చేసుకుంటారు కానీ.. కేటీఆర్‌లా తమ పుట్టినరోజును కొందరికైనా కొత్త వెలుగు ప్రసాదించేలా.. దానికి ఓ సార్థకత ఉండేలా చేసుకునే వారు కొందరే ఉంటారు.మానవజన్మతో ఏం చేయవచ్చో తెలిసే వారు మరీ అరుదుగా ఉంటారు.



## హ్యాపీ బర్త్‌డే..

కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

**హైదరాబాద్, జూలై24(తెలుగుప్రభ):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మునిసిపల్, ఐటీ శాఖల మంత్రి కె.తారకరామారావు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ, సినీ, పరిశ్రమల రంగాలకు చెందినవారి నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ హీరో చిరంజీవి 'నా ప్రియమైన సోదరుడు తారక్. మీరు డైనమిక్ లీడర్, మిమ్మల్ని మేమెంతో ప్రేమిస్తాం.. అభిమానిస్తాం. మీరు ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నా.మీకుఆదేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి'అంటూ ట్వీట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే అన్నయ్యా అంటూ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ట్వీట్ చేశారు. చిన్ననాటి నుంచీ నీతో గడిపిన ప్రతిక్షణం నాగుండెలో నిధిగా నిక్షిప్తమై ఉందని పేర్కొన్నారు. మీ అంకిత భావం, దయ, దూరదృష్టి కలిగిన నాయకత్వం ఎల్లప్పుడూ మాకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయన్నారు. గతంలో కేటీఆర్‌తో కలిసి దిగిన ఫొటోను షేర్ చేశారు.

## బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

విస్తృతంగా సామాజిక కార్యక్రమాలు

ముషీరాబాద్ లో టమాటాల పంపిణీ

పుట్టిన రోజున కేటీఆర్ కీలక నిర్ణయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ ఎస్ శ్రేణులు హైదరాబాద్ లో భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. నెక్లెస్ రోడ్ థ్రిల్ సిటీలో సికింద్రాబాద్ నేతలు కేక్ కట్ చేశారు. ప్రపంచ రికార్డు సాధించిన కుట్టి చే రూబిక్స్ క్యూబ్ ఆర్టిస్ట్ తో కేటీఆర్ భారీ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ముషీరాబాద్ లో నేతలు టమాటాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా.. తన పుట్టిన రోజు సందర్భంగా కేటీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలో నడుస్తున్న స్టేట్ హోంలోని అనాథ పిల్లలకు తన వంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు.

## మణిపూర్ ఘటనపై అమెరికా స్పందన

**న్యూఢిల్లీ, జూలై24(తెలుగుప్రభ):**



మణిపూర్ సంఘటనలపై మన ఢిల్లీ పెద్దలు తగిన విధంగా స్పందించకపోయినప్పటికీ, అగ్రరాజ్యం అమెరికా స్పందించింది. మహిళల్ని నగ్నంగా ఊరేగించడాన్ని అతి క్రూరమైన,భయంకరమైన దుర్ఘటనగా అభివర్ణించింది. బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేసింది. మణిపూర్‌లో మానవహక్కులు కాపాడాలని, శాంతిభద్రతలకు తగిన చర్యలు చేపట్టాలని కోరింది.

## 7 రోజుల పాటు రైళ్లు రద్దు

**హైదరాబాద్, జూలై24(తెలుగుప్రభ):**

నిర్వహణ పనుల్లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్‌లోని నాలుగు రైళ్లను నేటి నుంచి ఈనెల 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. వీటిల్లో కాచిగూడ–నిజాముద్దీన్, నిజామాబాద్–కాచిగూడ, హెచ్ఎస్ నాందేడ్–నిజామాబాద్, నిజామాబాద్–హెచ్ఎస్‌నాందేడ్ రైళ్లున్నాయి. మరో రెండు రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. దాండ్–నిజామాబాద్ రైలు దాండ్ నుంచి బయలుదేరి ముద్కేడ్ వరకే వెళ్లి, తిరిగి దాండ్‌కు చేరుకుంటుంది. నిజామాబాద్–పంధర్‌పూర్ రైలు ముద్కేడ్ నుంచి పంధర్‌పూర్ మధ్యే తిరుగుతుంది. కర్నూలు–సికింద్రాబాద్ రైలు 25వ తేదీన నిర్ణీత సమయం కంటే గంటన్నర ఆలస్యంగా బయల్దేరుతుంది. అలాగే గుంతకల్– బోధన్ రైలు ఈనెల 26,27, 30 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరతాయి.





## మృత్యువును జయించి..

**నలంద,జూలై24(తెలుగుప్రభ):**

బిహార్ నలంద జిల్లాలో నిన్న బోరుబావిలో పడిపోయిన శివమ్‌కుమార్ అనే ఐదేళ్ల బాలుడు బతికి బయటపడ్డాడు. జిల్లాలోని శిలాయో బ్లాక్‌లోని కుల్ గ్రామంలో తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు బోరుబావిలో పడ్డాడు. విషయం తెలిసి సంఘటన స్థలానికి చేరుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు బాలుడిని రక్షించేందుకు జేసీబీ యంత్రాలతో బోరుబావికి సమాంతరంగా తవ్వకాలు జరిపాయి. బావిలోని బాలునికి ఆక్సిజన్ అందేలా ఏర్పాట్లు చేశారు. వివిధ రకాలుగా ప్రయత్నాలు చేసి బాలుణ్ని పైకి తీసి బృందసభ్యులు కాపాడారు. బాలునికి ప్రమాదమేమీ లేదని, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు తెలిపారు.తగిన చికిత్స కోసం బాలున్ని ఆస్పత్రికి తరలించారు.

## పార్లమెంట్‌లో మణిపూర్ మంటలు



**న్యూఢిల్లీ, జూలై 24 (తెలుగుప్రభ)**

మణిపూర్‌లో జరిగిన దారుణంపై దేశమే కాదు.. ప్రపంచమే నివ్వెరపోతోంది. అగ్రరాజ్యం అమెరికా సైతం స్పందించింది. తాజాగా అక్కడ జరిగిన హింసాకాండపై ప్రధాని మోదీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ చేశాయి. ఈ నేపథ్యంలో సోమవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన ప్రదర్శన చేపట్టాయి. లోక్‌సభ, రాజ్యసభల్లోనూ ప్రధాని మోదీ మణిపూర్ అంశంపై ప్రకటన చేయాలని డిమాండ చేశాయి. ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటనపై ఎన్సీపీ ఎంపీ సుప్రీయా సూలే స్పందించారు. ఇది మహిళల సమస్య అని, ఇది రెండు రాష్ట్రాల మధ్య పోటీ కాదు అని, ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి ఘటన జరగకూడదని ఆమె అన్నారు.

## టమాటాలు.. వింత ఘటనలు..

**జహీరాబాద్, జూలై 24 (తెలుగుప్రభ)**

టమాటా ధరలు దిగి రావడం లేదు. భారీ ధరల వల్ల సామాన్యులు పడుతున్న బాధలతో పాటు, టమాటాలపై సైటర్లు తెగ వైరల్ అవుతున్నాయి. ఆ సంగతులు అలా ఉంటే.. టమాటాల దొంగతనాలూ జరుగుతూనే ఉన్నాయి.

తాజాగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. కూరగాయల మార్కెట్‌లో టమాటాలు దొంగతనం చేయాలని ఫిక్స్ అయ్యాడు ఓ దొంగ. అనుకున్నదే పని కానిచ్చేశాడు. ఏకంగా మూడు బాక్స్‌ల టమాటాలు కొట్టేసాడు. వీటి విలువ 7వేల రూపాయలు ఉంటుందని తెలుస్తుంది. జహీరాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌కు ప్రతి రోజులాగే శనివారం సాయంత్రం రైతులు టమాటాలను తీసుకొని వస్తే వారి వద్ద జగన్నాథ్ రెడ్డి అనే వ్యాపారి వాటిని హోల్ సేల్ లెక్కన కొన్నాడు.. రాత్రి షాప్ బంద్ చేసి ఇంటికి వెళ్లిన జగన్నాథ్.. తెల్లారి వచ్చి షాప్ తెరిచేలోపు మూడు టమాట బాక్స్‌లు కన్పించలేదు. అనుమానం వచ్చి సీసీ కెమెరాలో చూడగా ఓ వ్యక్తి తెల్లవారు జామున 4 గంటలకు షాప్‌లోకి వచ్చి, మూడు టమాట బాక్స్‌లు ఎత్తుకెళ్లినట్లు అందులో రికార్డ్ అయ్యింది. అసలే టమాటాలకు బయట బాగా డిమాండ ఉన్న నేపథ్యంలో ఇక్కడ టమాట దొంగతనం జరగడం పెద్ద చర్చనీయాంశమైంది.